ఈ రోజు సిపిఐ(యం) రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ప్రెస్‌మీట్‌లోని అంశాలను ప్రచురణార్థం మీకు పంపుతున్నాము. – జె.ప్రభాకర్

**తేది : 1.9.2018**

## టిడిపి, వైసిపిలు ప్రజాక్షేత్రంలో విఫలం
## 'నూతన రాజకీయ ప్రత్యామ్నాయ కార్యక్రమం' విడుదల

ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన బూర్జువా పార్టీల విధానాలకు భిన్నంగా 'నూతన రాజకీయ ప్రత్యామ్నాయం' కోసం కృషి చేస్తున్నామని ఉభయ కమ్యూనిస్టు పార్టీ నాయకులు వెల్లడించారు. సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన రాజకీయ ప్రత్యామ్నాయ కార్యక్రమాన్ని విజయవాడలోని సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఇరు పార్టీల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను బిజెపి, టిడిపి కలిసి మోసం చేశాయని విమర్శించారు. టిడిపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక వైఖరిని ఎండగట్టడంలో ప్రతిపక్ష వైసిపి విఫలమైందన్నారు. రెండూ పార్టీలు బిజెపితో కలిసి రాష్ట్రానికి తీరని ద్రోహం చేశాయన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో నూతన రాజకీయ ప్రత్యామ్నాయం అవసరమన్నారు. ఈ దిశగా సిపిఎం, సిపిఐ, జనసేన, ఆప్ తదితర పార్టీలు ఈ ఏడాది జూన్ 20న రాష్ట్ర సదస్సును నిర్వహించాయని గుర్తు చేశారు. దళితులు, మైనారిటీలు, మహిళలు, గిరిజనులు, విద్యార్థులు, రైతులు, కార్మికులు వ్యవసాయ కూలీల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించామన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు బస్సు జాతాలు చేపట్టామన్నారు. ఆగస్టు 29న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు వి.శ్రీనివాసరావు నేతృత్వంలో అనంతపురంలో ఒక జాతా ప్రారంభమైందన్నారు. మరో జాతా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో విశాఖలో శనివారం ప్రారంభమైందన్నారు. ఈ రెండు జాతాలు ఈ నెల 11న విజయవాడ చేరకుంటాయన్నారు. 15న మహాగర్జన పేరుతో భారీ బహిరంగసభ నిర్వహించనున్నామన్నారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా చంద్రబాబు ప్రభుత్వం అన్ని రంగాల్లో పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. మరోవైపు ప్రతిపక్ష వైసిపి బిజెపితో చెలిమి కోసం ఆరాటపడుతోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో దొందూ దొందేనని ఎద్దేవా చేశారు. అన్యాయంగా రాష్ట్రాన్ని విభజించిన కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతి, పోలవరం తప్ప మరో ధ్యాస లేదన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారిలా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. లక్షల కోట్లు పెట్టుబడులు వస్తాయని ఊరించిన చంద్రబాబు ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాన్ని పట్టించుకోవడం లేదన్నారు. 275 మండలాల్లో కరువు నెలకుంటే ఏం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించగల సత్తా ప్రత్యామ్నాయ కూటమికి మాత్రమే ఉందన్నారు. దేశానికి, రాష్ట్రానికి వామపక్ష ప్రత్యామ్నాయ కూటమి అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, కృష్ణమూర్తి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, కార్యవర్గ సభ్యులు ఎ.వనజ పాల్గొన్నారు.